www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 27-9-2025 | పేజీలు: 10 +8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 | సంచిక (Issue) : 163

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం, తిథి: పంచమి మ.12.04 తదుపరి షష్ఠి, నక్షత్రం: అనూరాధ రా.1.08, తదుపరి జ్యేష్ఠ, వర్జ్యం: లేదు, దుర్ముహూర్తం: ఉ.6.08-7.43, అమృతఘడియలు: మ.1.26-3.14, రాహుకాలం: ఉ. 9.00-10.30, సూర్యోదయం: 6.08, సూర్యాస్తమయం: 6.03

సిద్దిపేట *

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మల్లన్నసాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్లలోకి నోఎంట్రీ



మల్లన్నసాగర్ రిజర్వాయర్ వద్ద హెచ్చరిక బోర్డులను పరిశీలిస్తున్న గజ్వేల్ ఏసీపీ

తొగుట/ములుగు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మల్లన్నసాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టుల వద్ద సందర్శకులకు అనుమతి లేదని గజ్వేల్ ఏసీపీ కోణం నర్సింహులు స్పష్టం చేశారు. అక్రమంగా ప్రవేశించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రాజెక్టుల లోపలికి ఎవరూ వెళ్లకూడదని, ఈతకు దిగొద్దని పోలీసులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. మల్లన్నసాగర్‌లో మొసళ్లు ఉన్నందున చేపలు పట్టడానికి వెళ్లడం ప్రమాదకరమని తెలిపారు. పండుగ సెలవుల సందర్భంగా తల్లిదండ్రులు తమ పిల్లలను ఒంటరిగా గానీ, స్నేహితులతో గానీ ప్రాజెక్టుల వద్దకు ఈతకు పంపొద్దని సూచించారు. ఏదైనా ప్రమాదం జరగకముందే జాగ్రత్తలు తీసుకోవాలని, పెద్దచెరువుల వద్ద పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ సిబ్బందిని నియమించామని ఏసీపీ తెలిపారు.





● వీరనారి చాకలి ఐలమ్మ

భూమి కోసం భుక్తి కోసం విముక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని కలెక్టర్ హైమావతి తెలిపారు. శుక్రవారం చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా సుడా పార్కులో ఆమె విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులతో కలిసి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టరేట్‌లో నిర్వహించిన చాకలి ఐలమ్మ జయంతి వేడుకల్లో కలెక్టర్ మాట్లాడారు.

- సిద్దిపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి)



రిజర్వేషన్ టెన్షన్

పల్లె బరి... నేతల గురి..

- అదిగో..ఇదిగో జాబితా అంటూ వైరల్
- కొట్టిపారేస్తున్న అధికారులు
- దసరా తర్వాతనే ప్రకటించాలంటున్న ఆశావహులు
- పండగల నేపథ్యంలో ఖర్చుపై ఆందోళన

సిద్దిపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : "అదిగో పులి అంటే ఇదిగో తోక" అన్నట్లుగా గ్రామపంచాయతీ, పరిషత్ ఎన్నికల రిజర్వేషన్ వ్యవహారం కనిపిస్తోంది. అధికారికంగా రిజర్వేషన్లను ప్రకటించకున్నా ఎవరికివారే ప్రచారం చేసుకునే పరిస్థితి కనిపిస్తోంది. తమ గ్రామాలు, మండలాల రిజర్వేషన్లను తెలుసుకునేందుకు ఆశావహులు అన్ని దారులూ వెతుకుతున్నారు. కార్యదర్శి నుంచి కలెక్టరేట్ వరకు ఆరా తీస్తున్నారు. ఇదిగో రిజర్వేషన్ల జాబితా అంటూ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. వీటిని అధికారులు కొట్టిపారేస్తున్నప్పటికీ బయటకు ఎలా వచ్చాయో అంతుబట్టకుండా ఉంది. ఇది నిజమా..? అబద్ధమా..? అనే విషయంలో అస్పష్టత నెలకొన్నది. మొత్తంగా జిల్లాలో ఎన్నికల తాకిడికి పల్లె వాతావరణం వేడెక్కింది. ఏ క్షణంలోనైనా పరిషత్ లేదా గ్రామపంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేయొచ్చని రాష్ట్ర ప్రభుత్వం సంకేతాలిచ్చింది. దీంతో అందరి దృష్టి రిజర్వేషన్లపైకి మళ్లింది. రిజర్వేషన్ కలిసి వస్తేనే పోటీ చేస్తామనే ఆలోచనలో ఉన్న ఆశావహులు ప్రస్తుతం ఆగమాగం అవుతున్నారు. రిజర్వేషన్లపై ప్రచారం జరుగుతున్న క్రమంలో ఉత్కంఠ నెలకొంది.



బీసీకే జడ్పీచైర్మన్ సీటు..!

సిద్దిపేట జిల్లా పరిషత్ చైర్మన్ రిజర్వేషన్‌ను బీసీ సామాజిక వర్గానికి కేటాయించినట్లుగా ప్రచారం జరుగుతోంది. దీనికి సంబంధించిన కొన్ని జాబితాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇది వాస్తవమా.. అవాస్తవమా అనే విషయం తేలకుండా ఉంది. గత ఎన్నికల్లో సిద్దిపేట జడ్పీ చైర్మన్ స్థానాన్ని జనరల్ మహిళకు కేటాయించారు. ఈసారి రిజర్వేషన్లను మారుస్తారనే అంచనా ఉంది.

మిగతా 4వ పేజీలో



Local Body (SARPANCH) Elections Reservations

Mandal: Siddipet Rural

Sl.No	Village Name	2019 - 24	2025 Required	Cast Profile	Remarks
1	Bussapur	Gen	Gen	1.OC, 2.BC Mudiraj	
2	Chinthamadka	Gen	SC Gen	1.SC 2.BC Mudiraj	
3	Raghavapur	BC Gen	SC Mahila	1.SC 2.BC Bestha	
4	Rampur	SC Gen	BC Gen	1.SC 2.BC Kurma	
5	Pullur	BC Gen	BC Mahila	1.BC Mudiraj 2.SC	
6	Thornal	SC Gen	SC Mahila	1.SC 2.BC Mudiraj	
7	Peddalingareddypally	Gen Mahila	SC	1.OC, 2.BC Mudiraj	
8	Machapur	BC Mahila	BC Gen	1.BC Mudiraj 2.OC	
9	Chinnagundavelly	Gen	SC Mahila	1.OC, 2.SC	
10	Venkatapur	SC Mahila	BC Mahila	1.BC 2.SC	
11	Raorukula	SC Mahila	BC Mahila	1.BC Kurma 2.SC	
12	Bandacherlapally	BC Mahila	SC Gen	1.BC, 2.SC	
13	Seetharampally	SC Mahila	Gen	1.BC Mudiraj 2.OC	
14	Irkode	Gen Mahila	Gen Mahila	1.OC, 2.SC	
15	Bachaipally	New GP	BC Gen	Only BC Mudiraj	

Local Body (MPTC / ZPTC) Elections Reservations

Mandal: Siddipet Rural

Sl.No	Village Name	2019 - 24	2025 Required	Cast Profile	Remarks
1	Bussapur & Venkatapur	Gen	Gen Mahila	Gen	
2	Irkode & Rampur	SC Gen	BC Mahila	BC	
3	Thornal & Raorukula	SC Gen	BC Gen	BC	
4	Raghavapur & Peddalingareddypalli	Gen Mahila	SC Mahila	BC	
5	Chinnagundavelly & Bandacherlapally	BC Mahila	Gen Mahila	Gen	
6	Pullur	BC Mahila	BC Gen	Gen	
7	Machapur & [illegible]	BC Mahila	Gen	BC	

సిద్దిపేటఅర్బన్, సిద్దిపేట రూరల్ మండలాల రిజర్వేషన్ల జాబితా



రూ. 26 కోట్లు

- ఉపాధి 'కూలీ' బకాయి
- పండుగ పూట పస్తులే..
- 15 వారాలుగా చెల్లించని వైనం
- ఆకలితో అలమటిస్తున్న ఉపాధి హామీ కూలీలు

తొగుట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉన్న ఊరిలో ఉపాధి పనులు చేసుకుంటే నోట్లోకి నాలుగు మెతుకులు పోతాయన్న భావనలో ఉన్న కూలీలు పండుగపూట పస్తులుండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలో ఉపాధిహామీ పథకం కింద పనులు చేసిన కూలీలకు మూడు నెలలుగా కూలీ డబ్బులు ఖాతాలో జమ కావడం లేదు. సిద్దిపేట జిల్లాలో రూ. 26 కోట్ల పైచిలుకు బకాయిలు పేరుకపోవడంతో ఉపాధి కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సిద్దిపేట జిల్లాలోని వివిధ మండలాల్లోని గ్రామాల్లో జాతీయ ఉపాధిహామీ పథకం కింద వంద రోజుల పని కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా గ్రామాల్లోని చెరువులు, కాలువల్లో పూడికతీత, భూమి చదును చేయడం, మొక్కలు నాటడం తదితర పనులను చేయిస్తున్నారు. ఇందుకుగాను ఒక్కో కూలికి రూ. 307 చొప్పున కూలీ చెల్లించాల్సి ఉంటుంది. పనులు చేసిన 15 రోజుల్లోగా వారి ఖాతాల్లో డబ్బులు

మిగతా 4వ పేజీలో



వెంకట్రావ్‌పేటలో ఉపాధి హామీ పథకంలో భాగంగా పూడిక తీత పనులు చేస్తున్న కూలీలు







హుస్నాబాద్ పట్టణంలో పండుగ సందడి

బతుకమ్మ పండుగ సందర్భంగా హుస్నాబాద్ పట్టణం సందడిగా మారింది. శుక్రవారం హుస్నాబాద్‌లో జరిగే వారసంతకు తోడు మరో మూడు రోజుల్లో బతుకమ్మ వేడుకలు ఉండటంతో నిత్యావసర వస్తువులు, దుస్తులు, పూలు కొనుగోలు చేసేందుకు వచ్చిన మహిళలతో ప్రధాన రహదారులు కిక్కిరిసిపోయాయి. పూలు, రంగులు, గాజులు, కిరాణా, వస్త్ర దుకాణాలు రద్దీగా మారాయి. పూల దుకాణాలు కిటకిటలాడాయి.

హుస్నాబాద్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి)



వర్గల్ విద్యాధరి క్షేత్రంలో..



సిద్దిపేటలో రూ.10 లక్షల విలువైన కరెన్సీ నోట్లతో..



చేర్యాలలో కరెన్సీనోట్ల మాల అలంకరణలో..

పాహిమాం

నవరాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం విద్యాసరస్వతీ అమ్మవారు శ్రీ మహాలక్ష్మీ దేవి అలంకరణతో దర్శనమిచ్చారు. సిద్దిపేటలోని భారత్‌నగర్‌లో విశాలాక్షి సమేత విశ్వేశ్వర ఫ్యామిలి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి రూ.10లక్షల విలువ చేసే కరెన్సీ నోట్లతో అలంకరించారు. చేర్యాలలోని చావడి వద్ద దేవీస్నేహ యూత్ ఆధ్వర్యంలో అమ్మవారిని రూ.2లక్షల విలువగల కరెన్సీనోట్లతో అలంకరించారు. వాసవి పరపతిసంఘం, అయ్యప్పస్వామి ఆలయం, పెద్దమ్మగడ్డ కాలనీల్లో ఉత్సవ నిర్వాహకులు అమ్మవారికి కరెన్సీనోట్ల దండలు అలంకరించి కొలిచారు.

- వర్గల్/సిద్దిపేట కల్చరల్/చేర్యాల సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి)

తడిసిముద్దయిన జిల్లా

- గురువారం రాత్రి నుంచి ఉదయం వరకు వర్షం
- శుక్రవారం కమ్ముకున్న మేఘాలు
- జిల్లాలో గరిష్ఠంగా 66.8 మి.మీ వర్షపాతం నమోదు


మండలం	వర్షపాతం (మి.మీలలో)
అక్కన్నపేట	66.8
హుస్నాబాద్	52.5
నంగునూర్	51.0
దూలిమిట్ట	49.5
కొండపాక	45.0
చేర్యాల	43.0
కోహెడ	43.0
కుకునూర్‌పల్లి	418
కొమురవెల్లి	41.3
మద్దూరు	38.0
తొగుట	35.8
గజ్వేల్	35.3
ములుగు	34.3
దౌల్తాబాద్	32.3

సిద్దిపేట సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దాదాపుగా అన్నీ ప్రాంతాల్లో వర్షాలు దంచికొట్టాయి. గురువారం ఉదయం నుంచి చిరుజల్లులు కురియగా రాత్రి వర్షం జోరందుకుంది. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి జిల్లా తడిసి ముద్దయింది. శుక్రవారం ఉదయం తర్వాత వర్షం జాడే కనపడలేదు. పొద్దంతా మేఘాలు కమ్ముకున్నాయి. పండుగ సీజన్ కావడంతో వర్షం జాడే కనిపించకపోవడంతో అటు ప్రజలు హుషారుగా షాపింగ్ చేయగా, చిరు వ్యాపారస్తులు సైతం తమ వ్యాపారాన్ని కొనసాగించారు. జిల్లాలో గరిష్ఠంగా 66.8 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.





వర్షాలకు చిత్తడిగా మారిన సిద్దిపేట పట్టణ రహదారులు



అడుగడుగునా అడ్డంకులే!

765డీజీ హైవే నిర్మాణంలో జాప్యం

ఆరు నెలలుగా నిలిచిన పనులు

బైపాస్ భూనిర్వాసితుల ఆందోళన

రామాయంపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలో జాతీయ రహదారి 765డీజీ విస్తరణ పనులు ఆరు నెలలుగా నిలిచిపోయాయి. 2019లో జాతీయ రహదారిగా మారిన ఈ రోడ్డు విస్తరణకు అడుగడుగునా అడ్డంకులే ఎదురవుతున్నాయి. రూ.882 కోట్ల కేంద్ర నిధులతో మెదక్ జిల్లా పరిధిలో 68 కిలోమీటర్ల మేర చేపట్టిన ఈ పనుల్లో పలు సమస్యలు తలెత్తుతున్నాయి. రామాయంపేట మండలంలో నాలుగు కిలోమీటర్ల అటవీ రహదారి విస్తరించి ఉంది. ఈ పనులకు కేంద్ర అటవీశాఖ అనుమతులు రాకపోవడంతో గత మూడేళ్లుగా పనులు నిలిచిపోయాయి. ఇది ప్రాజెక్టు ఆలస్యానికి మరో ప్రధాన కారణంగా మారింది.



రామాయంపేట - మెదక్ దారిలో నిలిచిన జాతీయ రహదారి పనులు



చిన్నపాటి కుంటలా మారిన అక్కన్నపేట అండర్‌పాస్ నిర్మాణం

అసంపూర్తి పనులతో ప్రమాదాలు

మెదక్, సిద్దిపేట మార్గంలో అక్కడక్కడా పనులు అసంపూర్తిగా ఉండడం వల్ల వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటీవలి వరదలకు నందిగామ శివారులో ఒక కల్వర్టు కుంగిపోవడం వల్ల సిద్దిపేట - రామాయంపేట రహదారిపై పదిహేను రోజులు రాకపోకలు నిలిచిపోయాయి. పాత బ్రిడ్జిని ఉపయోగించడం వల్ల ఈ పరిస్థితి తలెత్తిందని, ఇది కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ప్రజలు ఆరోపిస్తున్నారు. తొనిగండ్ల వద్ద బైపాస్ పూర్తయినా, అండర్‌పాస్ నిర్మాణంతో అక్కన్నపేట గ్రామం అతలాకుతలమైంది. గ్రామం చివరి నుంచి నిర్మిస్తున్న అండర్‌పాస్ పనుల్లో జాప్యం నెలకొనడంతో గ్రామస్థులకు అసౌకర్యం కలుగుతోంది.

రామాయంపేట బైపాస్ వివాదం

రామాయంపేట మండలంలో మూడు బైపాస్‌ల ఏర్పాటు తలనొప్పిగా మారింది. హైదరాబాద్ వైపు ఉన్న విలువైన 33.20 ఎకరాల భూములు కోల్పోవాల్సి రావడంతో, 70 మంది నిర్వాసితులు ఆందోళన చేస్తున్నారు. ఆరేళ్లుగా ఈ సమస్య పరిష్కారం కాకపోవడంతో బైపాస్ పనులు ఆలస్యమవుతున్నాయి. గతంలో 2016లోనూ హైదరాబాద్ బైపాస్‌కు భూములు ఇచ్చామని, మళ్లీ ఇప్పుడు మరో బైపాస్‌కు ఇవ్వలేమని వారు మొండికేస్తున్నారు. దీంతో నిర్వాసితులకు పరిహారం అందించే విషయంలో జాప్యం జరుగుతోంది. జిల్లా కేంద్రమైన మెదక్‌లో బైపాస్ చేయకుండా, రామాయంపేట వంటి మండలంలో మరో బైపాస్ నిర్మించడం దేనికని రైతులు, స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



హవేళిఘణపూర్‌లో వేపచెట్టుపై దుర్గమ్మ రూపం

దీవించమ్మా.. వేపచెట్టు దుర్గమ్మ

హవేళిఘణపూర్, సెప్టెంబరు 26 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని దుర్గామాత ఆలయ ప్రాంగణంలోని వేపచెట్టుపై అమ్మవారి రూపాన్ని 2009 సంవత్సరంలో చెక్కించారు. హవేళిఘణపూర్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వేపచెట్టు దుర్గమ్మ దర్శనానికి భక్తులు తరలివస్తుంటారు. ప్రతియేటా దేవీశరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలోని అమ్మవారితో పాటు వేపచెట్టుపై ఉన్న అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు. భక్తులు ఇక్కడే ఒడిబియ్యం సమర్పిస్తారు.

మలుపులు లేకున్నా.. తప్పని కుదుపులు

● కంకర తేలి, గుంతలమయంగా మారిన రాయిపల్లి రోడ్డు

నారాయణఖేడ్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోనే అత్యంత ప్రత్యేకమైన రోడ్డుగా పేరుగాంచిన రాయిపల్లి - మెటల్ కుంట రహదారి అధోగతికి చేరింది. 47 కిలోమీటర్ల దూరం మలుపులు లేకుండా ఉండే ఈ రోడ్డుపై ప్రస్తుతం ప్రయాణం చేయాలంటే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అల్లాదుర్గం క్రాస్ రోడ్డు నుంచి వట్‌పల్లి, రాయిపల్లి, హద్నూర్ మీదుగా జహీరాబాద్, బీదర్ వరకు ఉన్న ఈ రహదారి ప్రస్తుతం కంకర తేలి, గుంతలమయంగా మారింది. దీనికి తోడు, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గుంతల్లో నీరు నిలిచిపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. రాయికోడ్ క్రాస్ రోడ్డు నుంచి రాయిపల్లి క్రాస్ రోడ్డు వరకు కొన్ని చోట్ల మోకాలి లోతు గోతులు ఏర్పడ్డాయి. రాయిపల్లి వంతెన సమీపంలో రోడ్డు ప్రమాదకరంగా మారడంతో కొంత మేరకు మొరం వేసినప్పటికీ, మళ్లీ వర్షాలు కురవడంతో పరిస్థితి యథాతథంగా మారింది. జహీరాబాద్ - బీదర్, మెదక్ - జోగిపేట వైపు వెళ్లే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణిస్తున్నారు. ఈ దారిలో రాకపోకలు 50 శాతానికిపైగా తగ్గిపోయాయి. ఆర్టీసీ బస్సులు తక్కువగా నడుస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ ప్రధాన రహదారికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



రాయిపల్లి వంతెన సమీపంలో గుంతల్లో చేరిన నీరు



నారాయణఖేడ్-రాయిపల్లి రోడ్డు క్రాస్ రోడ్స్ సమీపంలో తేలిన కంకర



చిన్నకోడూరులో విక్రయిస్తున్న గునక, బంతి, చామంతి, పట్ట గుచ్చుల తదితర పువ్వులు

ఏడు రోజులకే సద్దుల సంబురం

చిన్నకోడూరు మండలం ఆరు గ్రామాల్లో నేడు పెద్దబతుకమ్మ

చిన్నకోడూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సాధారణంగా అన్ని గ్రామాల్లో బతుకమ్మ పండగను తొమ్మిది రోజుల పాటు జరుపుకుంటారు. అమావాస్య రోజున ఎంగిలి పూల బతుకమ్మతో ప్రారంభమై తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మతో ముగుస్తుంది. కానీ ఇందుకు భిన్నంగా చిన్నకోడూరు మండలంలోని మాచాపూర్, చిన్నకోడూరు, మెట్టుపల్లి, సలేంద్రి, కమ్మర్లపల్లి, అల్లీపూర్ గ్రామాల్లో ఏడు రోజులకే సద్దుల బతుకమ్మ పండగను జరుపుకుంటారు. అనాదిగా ఈ సంప్రదాయం కొనసాగుతున్నది. ఓసారి సద్దుల బతుకమ్మ పండగ వేడుకలను జరుపుకుని బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేయడానికి అందరూ ఇళ్లకు తాళాలు వేసి వెళ్లారు. ఇంటికి తిరిగి వచ్చే సరికి దొంగలు ఇళ్లల్లో చొరబడి విలువైన వస్తువులను దొచుకెళ్లారు. దీంతో అప్పటి నుంచి సద్దుల బతుకమ్మ పండగను తొమ్మిది రోజులకు కాకుండా, ఏడు రోజులకే చేస్తున్నట్లు ఓ కథ ప్రాచుర్యంలో ఉంది. అడవిలో సహజంగా దొరికే తంగేడు, గునగ, గడ్డి చామంతి, గడ్డి పువ్వు దొరకకపోవడంతో బంతి, చామంతి, పట్టగుచ్చుల పువ్వులకు గిరాకీ పెరిగింది.

కనులపండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

గుమ్మడిదల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మండల కేంద్రంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మూడోరోజైన శుక్రవారం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని కన్నులపండుగగా నిర్వహించారు. అంతకుముందు ప్రత్యేక పూజ కార్యక్రమాలు అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ మద్దుల బాల్‌రెడ్డి, వంశంపార్య ధర్మకర్తలు పాలకమండలి సభ్యులు స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. కల్యాణం అనంతరం కవ్వం రవీంద్రారెడ్డి ఏర్పాటు చేసిన ఏర్పాటు చేసిన అన్నదానంలో భక్తులు పాల్గొని మహాప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దశరథ్, తహసీల్దార్ పరమేశ్వం, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ పడమటి లక్ష్మారెడ్డి, ఇందేల బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తులసీదాసు, వంశపారంపర్య ధర్మకర్తలు, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు

వృత్తి నైపుణ్యతతో మెరుగైన సేవలు

● మానవవనరుల అభివృద్ధి సంస్థ వైస్ చైర్‌పర్సన్ శాంతికుమారి



శిక్షణ యూనిట్‌లో శాంతికుమారి

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగుల వృత్తి నైపుణ్యం వల్ల సమాజానికి మెరుగైన సేవలందుతాయని మానవ వనరుల అభివృద్ధి సంస్థ వైస్ చైర్‌పర్సన్, డైరెక్టర్ జనరల్ శాంతికుమారి అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ శిక్షణ యూనిట్‌ను శుక్రవారం ఆ సంస్థ వైస్ చైర్‌పర్సన్, డైరెక్టర్ జనరల్ శాంతికుమారి, కలెక్టర్ హైమావతితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా శాంతికుమారి సంస్థ ద్వారా జిల్లాలోని ఉద్యోగులకు కల్పిస్తున్న శిక్షణ గురించి తెలుసుకున్నారు. శిక్షణ అనంతరం పరీక్షలు నిర్వహించాలని నిర్వాహకులకు ఆమె సూచించారు. ఎంసీహెచ్‌ఆర్‌డీ ద్వారా రెగ్యులర్‌గా స్ట్రెస్ మేనేజ్మెంట్, ఆఫీస్ మేనేజ్మెంట్, రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్, మహిళా సాధికారత, కమ్యూనికేషన్ స్కిల్స్, రెవెన్యూ శాఖ, గ్రామీణాభివృద్ధి అంశాలు, డాటా ఎంట్రీ ఆపరేషన్, శానిటేషన్ అండ్ హెల్త్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. అందుకు తగిన వసతులను సిద్దిపేట కేంద్రంలో ఏర్పాటు చేశామని, ఏమైనా అవసరమైతే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఆమెతో పాటు అదనపు కలెక్టర్ గరీమాఅగ్రవాల్, డీపీవో దేవకీదేవి, ఎంసీహెచ్‌ఆర్‌డీ రీజనల్ ట్రైనింగ్ మేనేజర్ భిక్షపతి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా అంతర్రాష్ట్ర భజన పోటీలు



భవానీ మందిర్‌లో భజన చేస్తున్న బృందం సభ్యులు

జహీరాబాద్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : దేవీనవరాత్రులు పురస్కరించుకుని జహీరాబాద్ పట్టణంలోని భవానీ మందిర్‌లో అంతర్రాష్ట్ర భజన పోటీలు ఉత్సాహభరితంగా కొనసాగుతున్నాయి. భవానీ భజన మండలి ఆధ్వర్యంలో 2022 నుంచి ఇప్పటివరకు పోటీలను నిర్వహిస్తున్నామని ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, గొల్లభాస్కర్, సూర్‌రెడ్డి, మహేందర్ తదితరులు తెలిపారు. 23న ప్రారంభమైన పోటీలు 29న ముగుస్తాయని సభ్యులు పేర్కొన్నారు. నిష్ణాతులైన తిరుపతికి చెందిన స్వర్ణలత, జహీరాబాద్‌కు చెందిన శంకర్‌జ్యోషి, చింతా మణిశర్మ ఆధ్వర్యంలో పర్యవేక్షించి నగదు ప్రోత్సాహకాలకు ఎంపిక చేస్తారని తెలిపారు. ఈ ఏడాది నిర్వహించే పోటీల్లో కర్ణాటక నుంచి రెండు, మహారాష్ట్ర నుంచి రెండు, ఆంధ్రప్రదేశ్ ఒక బృందం, తెలంగాణలోని జోగులాంబ, సంగారెడ్డి, వికారాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన ఐదు భజన బృందాలు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. 27న సెమీఫైనల్, 29న ఫైనల్ పోటీలు జరుగుతాయి. ఈ పోటీల్లో ప్రతిభను కనబర్చిన ఐదు భజన బృందాలకు నగదు ప్రోత్సాహకాలతో పాటు మెమొంటోను అందజేయనున్నారు.

'ఎల్లంకి'లో జాబ్ మేళాకు స్పందన



మెగా జాబ్‌మేళాలో కాలేజ్ కళాశాల యాజమాన్యం, తదితరులు

అమీన్‌పూర్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని బోర్డ్ ఆఫ్ అప్రెంటిషిప్ ట్రైనింగ్ విభాగం ఆధ్వర్యంలో అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎల్లంకి ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల మెగా జాబ్‌మేళా శుక్రవారం ముగిసింది. జాబ్‌మేళాలో 30 ప్రముఖ బహుళ జాతి సంస్థలు వందలాది మంది నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేసుకున్నారు. ముగింపు కార్యక్రమానికి తెలంగాణా కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మెన్ బాలకిష్టారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు.

గుమ్మడిదల-నర్సాపూర్ అటవీ మార్గంలో కారిడార్ ఏర్పాటుకు యత్నం

● మెదక్ పార్లమెంటు సభ్యుడు రఘునందన్‌రావు

నర్సాపూర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలోని 765డీ జాతీయ రహదారి గుమ్మడిదల - నర్సాపూర్ మధ్య ఉన్న అటవీ ప్రాంతంలో రోడ్డు విస్తరించే అవకాశం లేక ప్రమాదాలు జరుగుతున్న దృష్ట్యా పర్యావరణానికి ముప్పు వాటిల్లకుండా కారిడార్ ఏర్పాటుకు ప్రయత్నం చేస్తానని మెదక్ పార్లమెంటు సభ్యుడు రఘునందన్‌రావు పేర్కొన్నారు. కారదిడార్ ద్వారా రోడ్డు మార్గం వేసే విధంగా డీపీఆర్ తయారు చేయాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు తెలిపారు. శుక్రవారం నర్సాపూర్‌లో బీజేపీ పార్టీ కార్యాలయం ప్రారంభించిన సందర్భంగా బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరంతరం ప్రజల కోసం తపిస్తూ, తాను సన్యాసిగా మారి ఒక్క రోజు కూడా సెలవు తీసుకోకుండా ప్రధాని మోదీ నిరంతరం దేశం కోసం పనిచేస్తుంటే, ఏమీ తెలియని సన్నాసి రాహుల్ ప్రధాన ప్రతిపక్షంగా ఉండి ఏమి మాట్లాడుతున్నాడో కూడా తెలియని అయోమయ పరిస్థితి ఉందని విమర్శించారు. త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు మెంబరు నుంచి జిల్లా పరిషత్ చైర్మన్ వరకు బీజేపీ వారే ఉండేలా కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో కష్టపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నరమేష్ గౌడ్, రాష్ట్ర సీనియర్ నాయకులు పెద్దరమేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా నర్సాపూర్‌లో ఎంపీ రఘునందన్‌రావు, ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



చాకలి ఐలమ్మకు నివాళి అర్పిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు, తదితరులు

గ్రామీణ మహిళలకు ఉపాధి కల్పించడమే ప్రధాన లక్ష్యం

● కోయిర్ బోర్డ్ మేనేజర్ ప్రసాద్

గుమ్మడిదల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని కేంద్ర ప్రభుత్వ కోయిర్ బోర్డ్ మేనేజర్ ప్రసాద్ పేర్కొన్నారు. అమీన్‌పూర్ మండలంలోని పటేల్‌గూడ గ్రామానికి చెందిన మహిళలు శుక్రవారం గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలో ఉన్న శ్రీసత్యనారాయణ కొబ్బరి పీచు పరిశ్రమను సందర్శించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ క్వాయర్ బోర్డ్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న మహిళలు, పరిశ్రమ వ్యవస్థాపకులు చెన్నంశెట్టి మౌనిక ఉదయ్‌కుమార్ మార్గదర్శకత్వంలో కొబ్బరి ఆధారిత ఉత్పత్తుల తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఉదయ్‌కుమార్ పీచుతో తయారు చేసే వస్తువులను వివరించగా, మహిళలు ఆసక్తిగా విన్నారు. ఉపాధి సాధనలో ఇలాంటి చిన్న పరిశ్రమలు ఎంతో దోహదపడతాయని మహిళలు పేర్కొన్నారు.

టీబీ రోగుల 'పోషణ' నిధులకు కటకట

● రెండేళ్లుగా బాధితుల ఖాతాలో నిలిచిన నగదు జమ
● తీవ్ర ఇబ్బందులు పడుతున్న క్షయ రోగులు
● పౌష్టికాహార నగదు కోసం తప్పని ఎదురుచూపులు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : క్షయ (టీబీ) అ ఠొక ప్రాణాంతకరమైన వ్యాధి. ఆ రోగాన బారిన పడిన వారి అవస్థలు అన్నీ, ఇన్నీ కావు. ఊపిరితిత్తులు అదిరేలా దగ్గు రావడం, సరిగ్గా ఆకలి కాకపోవడం, బరువు తగ్గడం వంటి లక్షణాలతో తీవ్ర అవస్థలు పడుతారు. శరీరం బక్కచిక్కి, బరువు తగ్గి అస్థిపంజరంలా మారిపోతారు. దీనిని ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా ప్రాణానికే ప్రమాదం. ఈ వ్యాధి బాధితులకు చికిత్స ఎంత ముఖ్యమే, పౌష్టికాహారం తీసుకోవడమూ అంతే అవసరం. అయితే, వీరికి చికిత్స కాలంలో పౌష్టికాహారం తీసుకునేందుకు ప్రభుత్వం 'నిక్షయ్ పోషణ యోజన' పథకంలో భాగంగా ప్రతీ నెలా రోగి ఖాతాలో నగదు జమ చేయాలి. కానీ రెండేళ్లుగా ఈ నగదు జమ ప్రక్రియ నిలిచిపోయింది.

టీబీ కేసుల వివరాలు

సంవత్సరం	రోగులు
2020	1,718
2021	1,750
2022	2,501
2023	2,322
2024	2,602
2025(ఆగస్టు)	1,739



సంగారెడ్డిలోని జిల్లా క్షయ నివారణ కార్యాలయం

రెండేళ్లుగా నిధులకు కటకట

క్షయ రోగులకు అవగాహన లోపం, పేదరికం కారణంగా పోషకాహారం తీసుకోరు. వీరికి ఆర్థికంగా తోడ్పాటు అందించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతీ నెలా కొంత నగదును రోగి ఖాతాలో జమ చేస్తున్నది. క్షయ వ్యాధి నిర్ధారణ జరిగిన మొదటి నెలలో ప్రతీ రోగి ఖాతాలో రూ.3 వేలు జమ చేస్తారు. ఆరు నెలల చికిత్స కాలం తర్వాత చివరి ఆరవ నెలలో మరో రూ.3 వేలు పోషకాహారం కోసం చెల్లిస్తారు. కానీ గతేడాది 2024 జనవరి నుంచి ఇప్పటి వరకు పోషకాహారం నిధులు ప్రభుత్వం మంజూరు కాలేవు. దీంతో నిక్షయ్ పోషణ్ యోజన పథకం కింద సంగారెడ్డి జిల్లాకు 2024 ఏడాదిలో రూ.1,03,06,500, అదే విధంగా 2025 ఏడాది ఆగస్టు నెల వరకు రూ.1,04,34,000 నిధులు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని అధికారులు తెలిపారు.

నీరుగారుతున్న సర్కారు లక్ష్యం

దేశంలో క్షయ వ్యాధిని 2025 నాటికి పూర్తిగా పారదోలాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. ఇందు కోసం అధునాతన, ఖరీదైన యంత్ర పరికరాలు సమకూర్చడంతో పాటు ఎప్పటికప్పుడు రోగులకు సరిపడా మందులు పంపుతున్నది. కానీ, క్షయ వ్యాధిని పూర్తిగా పారద్రోలాలంటే సకాలంలో సరైన చికిత్సతో పాటు బలవర్ధకమైన పోషకాహారం తీసుకోవడం అత్యంత ఆవశ్యకం. ఈ పోషకాహార నిధులు విడుదల చేయపోవడంతో సర్కారు లక్ష్యం నీరుగారుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



శివంపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆయుధ పూజ

పుల్కల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం శివంపేట గ్రామంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శుక్రవారం ఆయుధ పూజ నిర్వహించారు. దసరా పండుగను పురస్కరించుకుని ట్రాన్స్‌కో ఏఈఈ సాయిరాఘవ ముఖ్య అతిథిగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ రంజిత, వంశీచంద్‌రెడ్డి, లైన్‌మెన్‌లు ఈశ్వర్, అనిల్‌కుమార్, రాజేష్, బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

'గీతం'లో జాతీయ ప్రిన్సిపాళ్ల సదస్సు

● హాజరైన 150 మంది ప్రధానోపాధ్యాయులు

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ పాఠశాల ప్రిన్సిపాల్స్ శిఖరాగ్ర సదస్సు ప్రిన్సిపాల్స్ కొలోక్వియం 2025 పేరిట హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం ప్రారంభమైంది. ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్(పీఎస్‌పీఏ) సహకారంతో నిర్వహిస్తున్న రెండు రోజుల కార్యక్రమానికి దేశవ్యాప్తంగా ఉన్న సీబీఎస్ఈ, ఐబీ, జాతీయ పాఠశాలలకు చెందిన 150 మంది ప్రిన్సిపాళ్లు తరలివచ్చారు. 'ఉన్నత విద్యను తిరిగి ఊహించుకోవడం: నాయకత్వం, విధానం, ఆచరణ' అన్న అంశంపై నిర్వహిస్తున్న ఈ సదస్సులో విద్యా పర్యావరణ వ్యవస్థ కోసం పాఠశాలలు, ఉన్నత విద్య, పరిశ్రమలను అనుసంధానించే కార్యాచరణపై చర్చించనున్నారు. పీఎస్‌పీఏ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ స్వాగత ప్రసంగం చేయగా, గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్, హైదరాబాద్ రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద, గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు, ఐఐటీ ఢిల్లీ ప్రొఫెసర్ సయ్యద్ హుసేన్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్‌నారాయణ్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు, ఎన్ఎస్ఏబీ సభ్యుడు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి, పాన్ ఫిష్ సొల్యూషన్స్ ముఖ్య కార్యనిర్వహణాధికారి డాక్టర్ అనురాధరావు, గ్రీస్ విద్యావేత్త, పరిశోధకురాలు డాక్టర్ రాయినా లాంపో, గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్, డీన్ కోర్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ వీఆర్ శాస్త్రి ఆయా అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



సదస్సులో పాల్గొన్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు

న్యూస్ బాక్స్

హుస్నాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి రూ. 15 కోట్లు

హుస్నాబాద్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మున్సిపాలిటీలో వివిధ అభివృద్ధి పనులకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో రూ. 15 కోట్లు మంజూరయ్యాయని కమిషనర్ మల్లికార్జున్ తెలిపారు. పట్టణంలోని దేవతల బావి వద్ద రూ.2 కోట్లతో షాపింగ్ కాంప్లెక్స్, పాత ఎమ్మార్వో కార్యాలయం వద్ద షాపింగ్ కాంప్లెక్స్‌కు రూ. 2 కోట్లు, పార్క్ నిర్మాణానికి రూ. 2 కోట్లు, వరద నీటి డ్రైనేజీల నిర్మాణానికి రూ. 8 కోట్లు, డబుల్ బెడ్ రూమ్ కాలనీ వద్ద ఇమినైటీస్ కొరకు రూ. 1 కోటి వెచ్చిస్తున్నామన్నారు. అలాగే గిరిజన సంక్షేమ శాఖ ద్వారా పోస్ట్ మెట్రిక్ బాయ్స్ హాస్టల్ నిర్మాణానికి రూ. 2.50 కోట్లు, పోస్టు మెట్రిక్ బాలికల హాస్టల్ నిర్మాణానికి రూ. 2.50 కోట్లు మంజూరయ్యాయన్నారు.

ఇంతింతై



మర్కుక్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మర్కుక్ మండల పరిధిలోని చేబర్తి గ్రామానికి చెందిన ర్యాకం లావణ్య తాజాగా వెలువడిన గ్రూప్ వన్ ఫలితాల్లో జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిగా ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆమె కామారెడ్డి జిల్లాకు చెందిన రామారెడ్డి పోలీస్ స్టేషన్లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతంలో నిరుపేద రైతు కుటుంబంలో పుట్టి బాసర ట్రిబుల్ ఐటీలో ఉన్నత విద్యను అభ్యసించింది. మొదట ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా, తర్వాత ఎస్ఐగా, ప్రస్తుతం జిల్లా అధికారిగా ఉద్యోగం సాధించినందుకు కుటుంబ సభ్యులు గ్రామస్థులు, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలియజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చేర్యాల/తొగుట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, ప్రజాసంక్షేమం సాకారమవుతుందని చేర్యాల మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక షాదీఖానాలో చేర్యాల, కొమురవెల్లి మండలాలకు చెందిన పలువురికి మంజూరైన రూ.2.65లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. తొగుట మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు శుక్రవారం దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 11 మంది లబ్ధిదారులకు రూ.3,02,500 విలువైన చెక్కులను అందజేసినట్టు ఆయన తెలిపారు.

లక్ష్మీదేవి చెరువుకు పొంచి ఉన్న ప్రమాదం

గజ్వేల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిడిచెడ్ గ్రామంలో లక్ష్మీదేవి చెరువుకు ప్రమాదం పొంచి ఉన్నది. ఇటీవల వర్షాలకు చెరువు నిండుకుండలా మారింది. అయితే కట్టకు పలు చోట్ల ప్రమాదం పొంచి ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కట్ట కింద పొలాలు ఉన్న రైతులు తమ సొంత డబ్బుతో కట్టను బయట నుంచి మట్టిని తీసుకువచ్చి మరమ్మతు చేయిస్తున్నారని మాజీ జడ్పీటీసీ పంగ మల్లేశం తెలిపారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కట్టకు ఏదైనా ప్రమాదం వాటిల్లితే దాదాపుగా 250 ఎకరాల్లో పంటకు నష్టంతో పాటు అహ్మదీపూర్ గ్రామానికి ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. తమ సొంత డబ్బుతో రైతులు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు.

సెలవుల్లో పిల్లలు జాగ్రత్త

వర్గల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దసరా సెలవుల్లో ఇంటి వద్ద ఉంటున్న పిల్లలను తల్లిదండ్రులు జాగ్రత్తగా చూసుకోవలని గౌరారం ఎస్ఐ కరుణకర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ సెలవుల్లో పిల్లలు చెరువులు, వాగులు, రోడ్లపై ఆటలు ఆడుతుండటం వలన ప్రమాదాలు చోటు చేసుకుని ప్రాణాలు పోగొట్టుకుంటున్నారన్నారు. తల్లిదండ్రులు పిల్లలపై దృష్టి పెట్టాలన్నారు.

ఊరెళ్తున్నారా.. జాగ్రత్త

తొగుట, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పండుగల నేపథ్యంలో ఊరెళ్లేవారు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ రవికాంత్‌రావు తెలిపారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటికి తాళం వేసి ఊరెళ్తే తప్పకుండా స్థానిక పోలీసులకు సమాచారమందించాలన్నారు. బంగారు నగలు, నగదును ఇంట్లో పెట్టవద్దని తెలిపారు. ప్రతీ ఇంటికి సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సార్, సెంట్రల్ లాక్ సిస్టం ఉండే తాళంతో పాటు సీసీ కెమరాలు అమర్చుకోవాలని సూచించారు. ఊరినుండి తిరిగొచ్చేవరకు ఇరుగుపొరుగు వారితో ఎప్పటికప్పుడు ఇంటి సమాచారం అడిగి తెలుసుకుని ఎవరైనా అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచార మందించాలని తెలిపారు.



తొగుటలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ముట్రాజ్‌పల్లిలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న నాయకులు



చేర్యాల అంగడిబజారు చౌరస్తా వద్ద ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్, రజకసంఘం నాయకులు

చాకలి ఐలమ్మకు ఘన నివాళి



కొండపాక మండలం దుద్దెడలో చాకలి ఐలమ్మ విగ్రహం ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీపీ ర్యాగల్ల సుగుణ దుర్గయ్య, నాయకులు

తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ 130వ జయంతిని శుక్రవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. ఆయా పట్టణాలు, గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో పలు పార్టీలు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు చోట్ల ఐలమ్మ విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భూమి కోసం భుక్తికోసం వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన యోధురాలు అని కొనియాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఆమె స్ఫూర్తిగా నేటి యువత, ఉద్యమకారులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

- న్యూస్‌నెట్‌వర్క్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి)

స్థానిక ఎన్నికల ప్రక్రియపై శిక్షణ



సిద్దిపేట డిగ్రీ కళాశాలలో ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న సిద్దిపేట అర్బన్, రూరల్ మండలాల ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ తరగతులను జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. ప్రిసైడింగ్ అధికారులు కరదీపికను చదివి అర్థం చేసుకోవాలన్నారు. ఎలాంటి అనుమానాలు వచ్చిన మాస్టర్ ట్రైనర్స్ దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామపంచాయతీ అధికారి దేవకీ దేవి, మాస్టర్ ట్రైనర్లు తదితరులు ఉన్నారు.

వివిధ మండలాల్లో అధికారులకు శిక్షణ

న్యూస్‌నెట్‌వర్క్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని ఐవోసీలో స్టేజ్-1, స్టేజ్-2, ప్రిసైడింగ్ అధికారులకు గ్రామపంచాయతీల రెండో సాధారణ ఎన్నికలపై శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్లు వారికి శిక్షణను ఇచ్చారు. కార్యక్రమంలో గజ్వేల్ ఆర్డీవో వీవీఎల్ చంద్రకళ పాల్గొని పలు సూచనలు చేశారు. జగదేవపూర్ మండల కేంద్రంలో గల రైతు వేదికలో 92 మంది ప్రిసైడింగ్ అధికారులకు రిసోర్స్‌పర్సన్లు శంకర్ రామకృష్ణారెడ్డి శిక్షణ ఇచ్చారు. మద్దూరు మండల పరిషత్ కార్యాలయంలో మద్దూరు, దూళిమిట్ట మండలాల ప్రిసైడింగ్ అధికారులకు మాస్టర్ ట్రైనర్స్ రామకృష్ణ, భాస్కర్ సన్నాహక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణపై తీసుకోవాల్సిన పూర్తి అంశాలపై అవగాహన కల్పించారు. చేర్యాల మండల ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులకు ముస్త్యాల గ్రామంలోని రైతువేదికలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కొండపాక మండల కేంద్రంలోని ఐవోసీ భవనంలో కొండపాక, కుకునూరుపల్లి, కొమురవెల్లి మండలాలకు చెందిన అధికారులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్ గరిమా అగ్రవాల్ పరిశీలించారు. నంగునూరు రైతు వేదికలో ఎన్నికల అధికారులకు నిర్వహించిన శిక్షణ సమావేశంలో ఎంపీడీవో పాల్గొని మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. దౌల్తాబాద్ మండల పరిధిలోని దొమ్మట రైతు వేదికలో శుక్రవారం ఇన్‌చార్జి ఎంపీడీవో సయ్యద్ గఫూర్ ఆధ్వర్యంలో ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.





సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన పేరెంట్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సత్యనారాయణ రెడ్డి, సమావేశానికి హాజరైన తల్లిదండ్రులు, విద్యార్థులు

ఇంటర్మీడియట్ కమిషనర్ ఆదేశానుసారం జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో శుక్రవారం పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కళాశాలలకు అందిస్తున్న నిధులు, కల్పిస్తున్న సౌకర్యాలు, విద్యార్థుల స్థితిగతులను తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థులను క్రమం తప్పకుండా కళాశాలలకు పంపించడంతో పాటు ప్రతినెలా పేరెంట్ టీచర్ మీటింగ్ హాజరై విద్యార్థుల స్థితిగతులను తెలుసుకొని అవసరమైన సూచనలు సలహాలు అందించాలని కోరారు.

న్యూస్‌నెట్‌వర్క్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి)

సిద్దిపేటలో సందడిగా మహిళల 5కే రన్



విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి):బతుకమ్మ పండుగ ఉత్సవాల సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా క్రీడాశాఖలో ఆధ్వర్యంలో మహిళలకు 5కే పరుగు పందెం నిర్వహించారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని జయశంకర్ గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో యువజన క్రీడల జిల్లా అధికారి జంగపల్లి వెంకట నరసయ్య పాల్గొని మాట్లాడుతూ ఆటలు, ఆరోగ్యం అనే నినాదంతో మహిళలకు పరుగు పందెం నిర్వహించామన్నారు. 5కె రన్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ క్రీడా సంఘాల బాధ్యులు, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాతూరి సుజాత, బాపురెడ్డి, వెంకటస్వామి, రవీందర్ రెడ్డి, అక్బర్, ఉప్పలయ్య, ప్రవీణ్, సంజీవ్, క్రీడాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బతుకమ్మ ఏర్పాట్లలో ప్రభుత్వం విఫలం: బీఆర్ఎస్

సిద్దిపేట సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బతుకమ్మ ఏర్పాట్లలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాల సాయిరాం విమర్శించారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు మోహిజ్, ప్రేమ్, నగేష్, రజనీకాంత్, షాహిద్, పొనమల్ల రాములుతో కలిసి పాల సాయిరాం మాట్లాడుతూ కాంగ్రెస్ మ్యానిఫెస్టో బూటకమని, ఇచ్చిన ఏ ఒక్కటి అమలు కాలేదన్నారు. మహిళలకు మొండి చెయ్యి చూపడంతో పాటు, రైతులకు అన్ని అంశాల్లో నిరాశే ఎదురైందని చెప్పారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ లేదని, దీంతో కళాశాలలు మూసే పరిస్థితి వచ్చిందని దుయ్యబట్టారు.

పండగ ఏర్పాట్లను విస్మరించిన ప్రభుత్వం

చిన్నకోడూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : బతుకమ్మ పండగ ఏర్పాట్లకు కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కేటాయించకుండా విస్మరించిదని మాజీ ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కాముని శ్రీనివాస్ విమర్శించారు. చిన్నకోడూరు మండలం మాచాపూర్‌లో శనివారం నిర్వహించే సద్దుల బతుకమ్మ వేడుకల్లో మాజీ మంత్రి హరీశ్‌రావు సతీమణి శ్రీనిత పాల్గొననున్న నేపథ్యంలో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు స్థల పరిశీలన చేసి ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జంగిటి శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

భూ కబ్జాదారులను అరెస్టు చేసిన పోలీసులు

సిద్దిపేట క్రైం సెప్టెంబర్ 26(ఆంధ్రజ్యోతి): భూ కబ్జా దారులను శుక్రవారం టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణ శివారులోని లోహిత్ సాయి హాస్పిటల్ వెనుకాల గల సర్వే నెంబర్ 1269 లో గంగిశెట్టి కైలాసం వెంచర్ చేశారు. కైలాసం నుంచి చేపూరి హన్మంతాచారీ ప్లాట్ నెంబర్ 70ని కొనుగోలు చేశాడు. తరువాత చేపూరి హన్మాంతాచారి అమ్మగా చకిలం వెంకట లక్ష్మి కొన్నారు. అనంతరం వారు హైదరాబాద్ లో ఉండగా సిద్దిపేట పట్టణానికి చెందిన బయ్యారం రాజమణి, బయ్యారం రాజయ్య భార్యభర్తలు ఇద్దరు 2022 సంవత్సరంలో ప్లాట్‌ను కబ్జా చేసి హద్దులు మార్చి అందులో రెండు రూమ్‌లు రేకుల షెడ్డు వేసి దానికి 18-19-93/బి/ని అని ఫేక్ ఇంటి నంబర్ వేసి బయ్యారం రాజయ్య తన భార్య బయ్యారం రాజమణికి గిఫ్ట్‌డీడ్ చేయించాడు. అసలైన ప్లాటు యజమాని చకిలం వెంకట్ లక్ష్మి ఆ ప్లాటు తమదని చెప్పడంతో, రాజయ్య, రాజమణి దంపతులు బెదిరించారు. ప్లాటు అన్యాక్రాంతం కావద్దని సిద్దిపేటలో కృష్ణుడి గుడి కోసం హరే కృష్ణ సత్సంగం వారికీ యజమాని రిజిస్ట్రేషన్ చేశారు. ఈ విషయమై హరే కృష్ణ సత్సంగ్ వారు ఫిర్యాదు చేయగా ఎస్ఐ అసిఫ్, కేసు నమోదు చేసి, విచారణ అనంతరం నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 13 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం సెప్టెంబర్ 26(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఇటీవల పోలీసులు నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో 13 మంది వాహనదారులు పట్టుబడ్డారు. వారిని గురువారం సిద్దిపేట అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ తరణి ఎదుట కోర్టులో హాజరుపరచగా విచారణ అనంతరం రూ.11,200 జరిమానా విధించారు.

కాడెడ్ల అపహరణ

రాయపోల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంసాగర్ గ్రామానికి చెందిన రైతు రాగి గణేశ్‌కు చెందిన కాడెద్దులు అపహరణకు గురయ్యాయి. బుధవారం సాయంత్రం వ్యవసాయ పొలం వద్ద రెండు ఎద్దులను కొట్టంలో కట్టేసి గురువారం ఉదయం వెళ్లి చూసేసరికి కనిపించలేదు. గుర్తు తెలియని వ్యక్తులు ఎద్దులను అపహరించుకుపోయారని తెలిపాడు. వాటి విలువ. రూ. 1.50 ఉంటుందని బాధితుడు తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపాడు.

పల్లె బరి.. నేతల గురి

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రం యూనిట్‌గా రిజర్వేషన్ల పంపకం ఉన్నందున బీసీ జనాభా అత్యధికంగా ఉన్న జిల్లాను ఈ దఫా బీసీకే ఇవ్వనున్నారనే చర్చ జరుగుతోంది. అందుకు తగినట్లుగా కొత్త సంకేతాలు రావడంతో ఆ వర్గాల్లో కసరత్తు మొదలైంది.

లీకైన రిజర్వేషన్ జాబితాలు

జిల్లాలోని పలు మండలాలకు సంబంధించిన రిజర్వేషన్ జాబితాలు లీకయ్యాయి. సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అవుతున్నాయి. కొన్ని పత్రాల రూపంలో ఉండగా.. మరికొన్ని కంప్యూటర్‌లోనే ఫొటోలు కొట్టి బయటకు లీక్ చేసినట్లుగా తెలుస్తోంది. ఆశావహులు అత్యుత్సాహంతో వీటిని సేకరించారా.. లేక కార్యాలయాల సిబ్బందే లీక్ చేశారా? అనే విషయం తేలాల్సి ఉంది. దీనిపై జిల్లా అధికారులను అడిగితే కొట్టిపారేస్తున్నారు. తాము అన్ని జాబితాలను ప్రభుత్వానికి నివేదించామని.. పూర్తిస్థాయిలో గోప్యత పాటిస్తున్నట్లుగా చెబుతున్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీలతోపాటు సర్పంచ్‌ల రిజర్వేషన్ల జాబితాలూ చక్కర్లు కొడుతున్నాయి.

దసరా ఖర్చుతో దడ

పల్లెబరిలో నిలవాలనుకునే ఆశావహులు దసరా ఖర్చుకు భయపడుతున్నారు. దసరా తర్వాతనే రిజర్వేషన్లు ప్రకటిస్తే తమకు అనుకూలంగా ఉంటుందని కోరుతున్నారు. రిజర్వేషన్లు ముందే ప్రకటిస్తే మద్యం, మాంసం, చందాల ఖర్చు తడిసిమోపెడవుతుందని తమ గోడు చెప్పుకుంటున్నారు. ఇప్పటికే రెండేళ్లుగా ఖర్చులు భరించి ఇబ్బందులు పడ్డామని.. దీనికితోడు దసరా ఖర్చు తోడైతే కోలుకోలేమని వాపోతున్నారు. రిజర్వేషన్లు ఖరారు కాకపోవడంతో కాస్త ప్రశాంతంగా ఉన్నామని.. ఖరారైతే ఇక ఖర్చులో మునిగితేలాల్సిందేనని ఓ నాయకుడు తన మనసులో మాట వెల్లడించారు. దసరా తర్వాత రిజర్వేషన్లు ప్రకటిస్తే ఎంతో కొంత ఉపశమనం కలుగుతుందని అంటున్నారు.

రూ.26కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

జమ చేసేవారు. జిల్లాలో 2,23,429 మంది ఈ పథకం కింద వివిధ పనులు చేశారు. అయితే, వారికి మే 23 నుంచి చేసిన పనులకు గాను కూలీ డబ్బులు ఖాతాలో జమ కాలేదు. మొత్తంగా 23 మండలాల్లో రూ. 26,01,52,140 కోట్లు బకాయిలు పేరుకుపోయాయి. కూలీ డబ్బుల కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

పండుగ పూట పస్తులుండాలా!



ఉపాధి పనులు చేసి మూడు నెలలు అయింది. ఇంత వరకు డబ్బులు రాకపోతే ఎలా బతకాలి. పండుగ వచ్చింది. పండుగ పూట కూడా పస్తులుండలా.. రోజు అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. ఎవరూ పట్టించుకుంటలేరు. రేపు, మాపు వస్తయి అని చెబుతున్నరు. వాళ్ల చుట్టూ తిరగలేక ఇబ్బందిపడుతున్నం. మా డబ్బులు మాకు వచ్చేలా చూడండి.

- పాత్కుల సుజాత, ఉపాధి కూలీ, వెంకట్రావ్‌పేట

ఎట్లా బతికేది



కూలీ డబ్బుల కోసం సార్ల చుట్టూ రోజు తిరుగుతున్నం. రోజు రేపు మాపు అంటున్నరు. పనులు చేపించుకుని ఇట్లా తిప్పితే ఎట్లా బతికేది. కష్టం చేసిన సొమ్మురాకపోతే ఎట్లా. మాకు న్యాయం చేయండి.

- భైరయ్య, ఉపాధి కూలీ, గుడికందుల

బకాయిలున్నది వాస్తవమే

ఉపాధి హామీ పథకంలో పనులు చేసిన కూలీలకు జిల్లాలో రూ. 26 కోట్ల పైచిలుకు బకాయి డబ్బులు పెండింగ్‌లో ఉన్నది వాస్తవమే. మే 23 నుంచి కూలీల ఖాతాల్లో డబ్బులు జమ చేయాల్సి ఉంది. కేంద్రప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో ఆలస్యమైంది. డబ్బులు రిలీజ్ అయ్యాయి త్వరలోనే కూలీల ఖాతాల్లో జమ చేస్తాం.

- జయదేవ్ ఆర్యా, డీఆర్డీఏ పీడీ

ఔషధాల పంపిణీలో ఫార్మసిస్టుల పాత్ర కీలకం



ఫార్మసిస్టు డేలో విద్యార్థులతోఅధ్యాపకులు

గజ్వేల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఔషధాల పంపిణీలో ఫార్మసిస్టుల పాత్ర కీలకమని సురభి దయాకర్‌రావు ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ అన్నారు. గజ్వేల్ మండలం రిమ్మనగూడ శివార్లలోని సురభి దయాకర్‌రావు ఫార్మసీ కళాశాలలో అంతర్జాతీయ ఫార్మసిస్ట్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం మొక్కలను నాటి బతుకమ్మ సంబరాలను జరుపుకున్నారు. వారితో వైస్ ప్రిన్సిపాల్ గణేశ్, సిబ్బంది తదితరులున్నారు.

కొండపాక పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ

కొండపాక, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): కొండపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజు శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల హాజరు, ఇతర రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఆరోగ్య కార్యక్రమాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఫార్మసీ గది, ల్యాబ్ పనితీరును ఆయన పరిశీలించారు. వర్షాల ప్రభావం వల్ల ప్రబలే వ్యాధులను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో జ్వర సర్వేను నిర్వహించాలని, అవసరం ఉన్నచోట్ల మెడికల్ క్యాంపులు నిర్వహించాలన్నారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సమయపాలన పాటించాలని తెలిపారు.

సీనియారిటీ ఆధారంగా అవకాశం కల్పించండి

సిద్దిపేట క్రైం, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): జీవో 190ని సవరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27న చలో హైదరాబాద్ జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జీవో 317 బాధిత ఉద్యోగ ఉపాధ్యాయ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. ఐలయ్య కోరారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లా విభజన అనంతరం జీవో317 అమలులో కొన్ని అన్యాయాలు జరిగాయని ఐలయ్య పేర్కొన్నారు. జీవో 190ను సవరించి, మొదటి ఆప్షన్ పెట్టుకొని రాని వారందరికి సీనియర్లకు 190 జీవోలో అవకాశాన్ని కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.తమ సమస్యలను పరిష్కరించాలని సెప్టెంబర్ 18న మంత్రి శ్రీధర్ బాబు ను కలిసి విన్నవించినట్లు తెలిపారు. సమావేశంలో సంపత్ ,అశోక్, బాలరాజు, మల్లేశం, స్వప్న, మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

వ్యాపారులు పరిశుభ్రత పాటించాలి

సిద్దిపేట సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వీధి విక్రయ వ్యాపారులందరూ తప్పకుండా పరిశుభ్రత పాటించాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ సూచించారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని విపంచి కళానిలయంలో వీధి వ్యాపారుల సంక్షేమం, అభివృద్ధి కోసం నిర్వహించిన లోక్ కల్యాణ మేళాలో సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధి విక్రయ వ్యాపారులందరూ పర్యావరణ హితంగా, శుచిగా ఉండేలా చూడాలని సూచించారు. ప్లాస్టిక్ ప్లేట్లకు బదులుగా మోదుగు ఆకులు వంటివి వినియోగించాలని సూచించారు. సిద్దిపేటను ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దడానికి అందరి సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో అధికారులు హనుమంతరెడ్డి, సిబ్బంది జ్యోతి, రేణుక, శంకర్, వంశీ పాల్గొన్నారు. కాగా సిద్దిపేటలోని 10వ వార్డు సుభాష్‌నగర్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్య ఉందన్న ఫిర్యాదు మేరకు, నేరుగా వెళ్లి యూజీడీ సమస్యను మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ పరిష్కరించారు. కోమటి చెరువు వద్ద బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలించారు. సుడా నర్సరీ నిర్వహణను ఆకస్మికంగా పరిశీలించి పలు సూచనలు చేశారు.

సమస్యలపై కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు వినతి



బండి సంజయ్‌కు పూలమొక్క అందజేస్తున్న మండల నాయకులు

కోహెడ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ సమస్యలు పరిష్కరించాలని, అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించాలని కరీంనగర్ ఎంపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని బీజేపీ మండల నాయకులు కోరారు. శుక్రవారం కరీంనగర్‌లో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఇందులో జిల్లా కౌన్సిల్ సభ్యులు ఖమ్మం వెంకటేశం, బీజేపీ మండల అధ్యక్షుడు జాలిగం రమేష్, మాజీ సర్పంచ్ మ్యాకాల చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

తహసీల్ కార్యాలయంలో సమయపాలన ఏదీ?





ఉదయం 11.30 గంటలకు ఖాళీగా తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్ చాంబర్లు

అక్కన్నపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అక్కన్నపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. శుక్రవారం ఉదయం 11-30 గంటలకు ఆంధ్రజ్యోతి తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించింది. ఆ సమయం దాటినా కూడా కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ రమ మినహా మిగతా కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. కాగా ఉదయం 10 గంటలకే తహసీల్దార్ కార్యాలయానికి వివిధ పనులపై వచ్చిన ప్రజలు అధికారుల కోసం ఎదురు చూస్తూ అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సమయపాలన పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

వైద్యశిబిరాలకు విశేష స్పందన



మద్దూరులో వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మద్దూరు/నంగునూరు/ములుగు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పలు మండలాల్లో మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలకు శుక్రవారం విశేష స్పందన లభించింది. మద్దూరు పీహెచ్‌సీలో నిర్వహించిన వైద్య శిబిరంలో జనరల్ వైద్యులు భాస్కర్, గైనకాలజిస్ట్ పి. శీజ, చిన్నపిల్లల వైద్యులు ఎం. మేఘన, కంటి వైద్యులు హేమలత, చర్మవ్యాధుల నిపుణులు జి. జనని, మానసిక వైద్యులు ప్రగ్నశ్రీ, డాక్టర్ మహేందర్ 151 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. 32 మందికి రక్తన మూనాలు సేకరించారు. హుస్నాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఆనంద్‌తో పాటు స్థానిక మద్దూరు, దూళిమిట్ట ఎంపీడీవోలు రాంమోహన్, వీరరాజ్‌లు సందర్శించి రోగులకు అందిస్తున్న సేవలపై పరిశీలించారు. కార్యక్రమంలో లద్నూరు వైద్యాధికారి అర్జున్, సీహెచ్‌వో ప్రకాష్, యూడీసీ సదయ్య, హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మి, స్టాఫ్ నర్స్ మాధవి, ఫార్మసిస్ట్ సందీప్, హెల్త్ అసిస్టెంట్ రఘు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు. నంగునూరు మండలం గట్లమల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 173 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్టు వైద్యాధికారి డాక్టర్ అంజలి రెడ్డి పేర్కొన్నారు. అనంతరం పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను జరుపుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, ఐకేపీ, సిబ్బంది పాల్గొన్నారు. ములుగులోని తొమ్మిది గ్రామాలకు ప్రజలకు ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించినట్టు వైద్యాధికారి దీప్తి పేర్కొన్నారు. అందరికీ ఉచితంగా మందులు పంపిణీ చేసినట్టు తెలిపారు.